సబ్‌స్టేషన్ నిర్మాణం ఎప్పుడో ?

- రెండేళ్లుగా కొలిక్కి రాని స్థల సమస్య
- లో వోల్టేజీతో తరచూ అంతరాయం
- షార్ట్ సర్క్యూట్‌తో ఆస్తి నష్టాలు
- మాన్వాడలో నిర్మిస్తే నాలుగు గ్రామాలకు ప్రయోజనం


నర్సింగాపూర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇంట్లో కాలిపోయిన సామగ్రి (ఫైల్)

బోయినపల్లి (చొప్పదండి): మండలంలోని మాన్వాడ గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు ఎదురుచూపులు తప్పడం లేదు. రెండేళ్ల క్రితం మాన్వాడలో 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేస్తూ ఎస్పీడీసీఎల్ ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు నిర్మాణానికి సుమారు రూ.1.50 కోట్లమేర బడ్జెట్ కేటాయించినట్లు సెస్ ఏఈ ప్రశాంత్ తెలిపారు. అయితే సబ్‌స్టేషన్ నిర్మాణానికి గ్రామంలో ప్రభుత్వ స్థలం గుర్తించేందుకు సమస్య కొలిక్కి రాక పోవడంతో రెండేళ్లుగా నిరీక్షణ తప్పడం లేదు. దీంతో ఓవర్ లోడ్‌తో పలుగ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి.

ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్లు

మండలంలో ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. ఇందులో వెంకట్రావుపల్లి 3311కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఒకటి. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో కొదురుపాక, నీలోజిపల్లి, వరదవెల్లి, వెంకట్రావుపల్లి, జగ్గారావుపల్లి, మాన్వాడ, కొత్తపేట, మల్లాపూర్, నర్సింగాపూర్ 9 గ్రామాలున్నాయి. దీంతో సబ్‌స్టేషన్‌పై లోడ్ ఎక్కువై తరచూ లో వోల్టేజీతోపాటు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో ఆస్తినష్టం వాటిల్లుతోంది. నర్సింగాపూర్‌లో గత అక్టోబర్ 28న రేగుల సాయిలు, నవంబర్ 13న ఎలగందుల శ్రీనివాస్ ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో పెద్దమొత్తంలో మంటలంటుకొని నష్టం జరిగింది. ఓవర్ లోడ్‌కు చెక్ పెట్టేందుకు ఎస్పీడీసీఎల్ అధికారులు మాన్వాడ, కొత్తపేట, మల్లాపూర్, నర్సింగాపూర్ గ్రామాలతో మాన్వాడలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం మంజూరు చేసినా స్థల సమస్య ఏర్పడి అవస్థలు పడుతున్నారు.

రెండేళ్లుగా కొలిక్కిరాలే

మధ్యమానేరు ప్రాజెక్టు కట్ట పరిసరాల్లోని మాన్వాడలో సుమారు వంద ఎకరాల మేర భూమిని ప్రభుత్వం సేకరించింది. సేకరించిన భూమి ఇరిగేషన్ శాఖ ఆధీనంలో ఉంది. విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎకరం మేర స్థలం కేటాయించాలని సర్పంచ్ రామిడి శ్రీనివాస్ కలెక్టర్, తహసీల్దార్‌కు పలుసార్లు విన్నవించినట్లు తెలిపాడు. నేటికీ స్థల సమస్య కొలిక్కి రాలేదు. ఓ వైపు అధికారులు సబ్‌స్టేషన్ నిర్మాణానికి నిధులు కేటాయించినా, స్థలంలేక సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయకపోవడం విడ్డూరమని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్థలం కేటాయించి సబ్‌స్టేషన్ నిర్మాణం పనులు ప్రారంభించాలని నాలుగు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తరచూ అంతరాయం


వెంకట్రావుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో తొమ్మిది గ్రామాలు ఉండటంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. మాన్వాడ గ్రామంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే నాలుగు గ్రామాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది. దీంతో నాణ్యమైన విద్యుత్ అందుతుంది.
– ల్యాద రమేశ్, కొత్తపేట

అధికారులు చొరవ చూపాలి


మాన్వాడలో 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలం గుర్తించడంలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. స్థలంలేక రెండేళ్లుగా నిర్మాణ పనులు ఆగిపోవడం విడ్డూరం. వెంకట్రావుపల్లి ఫీడర్‌కు అధిక కనెక్షన్లు ఉండటంతో తరచూ లోవోల్టేజీ సమస్య ఏర్పడుతోంది. వెంటనే అధికారులు స్థలం గుర్తించాలి.
– ఐల శివరాం, మల్లాపూర్

స్థలం కేటాయిస్తే నిర్మాణం


మాన్వాడలో సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం అధికారులు ఉత్తర్వులు మంజూరుచేశారు. స్థలంలేక నిర్మాణం ఆ గింది. దీనిపై నిజామాబాద్ ఎన్పీడీసీఎల్ ఏఈ, ఏడీఈతో చర్చించాం. రెవెన్యూ అధికారులు స్థలం గుర్తించి ఇస్తే అధికారులు సబ్‌స్టేషన్ నిర్మాణం పనులు ప్రారంభిస్తారు.
– ప్రశాంత్, సెస్ ఏఈ, బోయినపల్లి

క్లుప్తంగా

నేడు ప్రభుత్వ విప్ పర్యటన

కోనరావుపేట: మండలంలోని సుద్దాలలో బుధవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పర్యటించనున్నట్లు మండల శాఖ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా తెలిపారు. గ్రామంలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, మహిళా సంఘంభవనం, క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

మొగిపురుగు నివారణకు చర్యలు


రైతులకు సూచనలు చేస్తున్న ఏఈవో

ముస్తాబాద్: వరిపంటలో సస్యరక్షణ చర్యలకు రైతులకు సూచనలు చేసినట్లు ఏఈవో ప్రదీప్ తెలిపారు. మండలంలోని గూడెంలో వరిపంటను మంగళవారం పరిశీలించారు. వరిలో మొగిపురుగు ఆశించకుండా చర్యలు తీసుకుకునేందుకు సూచనలు అందించట్లు తెలిపారు. మాజీ ఎంపీటీసీ ఎల్లాగౌడ్, రైతులు ఉన్నారు.

ఆవునూర్‌లో డీఎస్పీ విచారణ

ముస్తాబాద్: ఆవునూర్‌లో ఇరువర్గాల మధ్య జరిగిన వివాదంపై సిరిసిల్ల ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి మంగళవారం విచారణ చేపట్టారు. బీజేపీ నాయకుడు క్రాంతికుమార్, సలావుద్దీన్ ఇరువురిపై నమోదైన కేసులపై విచారణ చేశారు. సాక్షులను విచారించారు. మూడు రోజుల క్రితం జరిగిన ఘటనపై ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. సీఐ సదన్‌కుమార్, ఎస్సై శేఖర్ తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత



చందుర్తి: మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన చింతకుంట మల్లేశం అనే రైతుకు సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు మంగళవారం రూ.40వేల చెక్కును అందజేశా రు. మూడు నెలల క్రితం విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందింది. ఆర్థికంగా నష్టపోయిన రైతుకు సెస్ నుంచి మంజూరైన ఆర్థికసాయాన్ని ఆయన అందించారు. సర్పంచ్ గంగాధర్, ఎంపీపీ లావణ్య, మాజీసర్పంచ్ మల్లిక్ ఉన్నారు.

మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు


వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామ శివారులోని సాయిబాబా ఆలయం వద్ద మంగళవారం రాత్రి పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. మద్యంతాగి వాహనాలు నడుపుతున్న నలుగురిపై కేసులు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. నెలరోజుల వ్యవధిలో మండలంలోని 70 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 55 వాహనాలకు సరైన పత్రాలు లేకపోవడంతో జరిమానా విధించామన్నారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్సై సూచించారు.

క్రీడలతో మానసికోల్లాసం

తంగళ్లపల్లి: మండలంలోని గండిలచ్చపేటలో మాజీ జెడ్పీటీసీ కోడి అంతయ్య ఆధ్వర్యంలో మంగళవారం క్రికెట్ టోర్నీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వేణుగోపాలరావు, సిరిసిల్ల సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్, నాయకులు బాబు, ఆత్మకూరి చంటి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని సారంపల్లి ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఆర్కమిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెద్ద బాలశిక్ష పుస్తకాలను పంపిణీ చేశారు. హెచ్‌ఎం ఎల్లయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ నసీరుద్దీన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, కవిత పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

తంగళ్లపల్లి: మండలంలోని నేరెళ్లలో మంగళవారం కరీంనగర్‌కు చెందిన పద్మపాణి సొసైటీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని 50 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ మంజుల మల్లేశం, నేరెళ్ల పీహెచ్‌సీ మెడికల్ అధికారి రేఖ, పంచాయతీ కార్యదర్శి రాజు, ఏఎన్‌ఎం విమల, ఆశావర్కర్లు మాధవి, కమలవ్వ, సూపర్‌వైజర్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల దాడి హేయమైన చర్య


మాట్లాడుతున్న యెల్ల బాల్‌రెడ్డి

ముస్తాబాద్: శాంతియుతంగా భారత్ జోడో న్యాయ్ యాత్ర చేస్తున్న రాహుల్‌గాంధీపై బీజేపీ నాయకులు అస్సాంలో దాడులకు దిగడం హేయమైన చర్య అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రాహుల్‌గాంధీ యాత్రపై ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఆలయంలోకి ప్రవేశించకుండా బీజేపీ అడ్డుకుందన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు అమలు చేసి తీరుతారని, బీఆర్‌ఎస్ నాయకులు ఓపిక పట్టాలన్నారు. డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు బుర్ర రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శులు మిర్యాల్‌కార్ శ్రీనివాస్, పెద్దిగారి శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, ఎంపీటీసీ శ్రీనివాస్, తలారి నర్సింలు, శీల ప్రశాంత్, తిరుపతి, కొండల్ రెడ్డి, కొండయ్య, చంద్రమౌళి, కొంరయ్య, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం మండల అధ్యక్షుడిగా యాదగిరి


ఎన్నికైన పాలకవర్గసభ్యులు

ముస్తాబాద్: మండల గౌడసంఘం ఎన్నికలు మంగళవారం జరిగాయి. అధ్యక్షుడిగా మండలకేంద్రానికి చెందిన కొండ యాదగిరిగౌడ్, ఉపాధ్యక్షుడిగా గున్నాల వెంకటస్వామి గౌడ్ (చీకోడ్), తుపాకుల శ్రీనివాస్‌గౌడ్ (బందనకల్), ప్రధాన కార్యదర్శిగా గడ్డమీది రామచంద్రం గౌడ్(తెర్లుమద్ది), కోశాధికారిగా కదిరె బాలాగౌడ్, కార్యదర్శిగా నాగరాజు గౌడ్ ఎన్నికయ్యారు. గీత కార్మికుల హక్కుల కోసం కృషి చేస్తామని యాదగిరిగౌడ్ పేర్కొన్నారు.

సిరిసిల్లలో 'పరాక్రమ్ దివస్'


ప్రతిభచూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి(పరాక్రమ్ దివస్)ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు కేంద్రీయ విద్యాలయం ఆవరణలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి వివిధ పాఠశాలలకు చెందిన వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ×పరీక్షా వారియర్స్ పుస్తకంలోని మంత్రాలు, నేతాజీ సుభాష్ చంద్రబోస్, చంద్రయాన్, స్పోర్టింగ్ సక్సెస్ ఆఫ్ ఇండియా, వికసిత్ భారత్, ఆదిత్య ఎల్–1 అంశాలను చిత్రలేఖనం పోటీల్లో ఇతివృత్తాలుగా నిర్వహించారు. తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్–ఫైన్ ఆర్ట్స్ అకాడమీ బోధనా సిబ్బంది స్వప్న, ఎం.ప్రభాకర్‌రావు, హెచ్‌ఎం వి.అరుణ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన బి.అక్షయ, కేంద్రీయ విద్యాలయం విద్యార్థి సిరిసిల్లకు చెందిన ఎం.నిర్విఘ్న, జెడ్పీహెచ్‌ఎస్ నెహ్రూనగర్ స్కూల్‌కు చెందిన జి.నిఖిల్, శ్రీకృష్ణ టాలెంట్ స్కూల్ నుంచి ఎ.దుర్గప్రసన్న, కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన ఆర్.ఊర్మిళ మొదటి ఐదు స్థానాల్లో నిలిచారని విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కేపీ సింగ్ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పోటీల్లో అద్భుతమైన చిత్రాలను ఆవిష్కరించారు.

రోడ్డు భద్రతపై అవగాహన

తంగళ్లపల్లి: మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో మంగళవారం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకుని వాహనాలు నడపాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. ప్రిన్సిపాల్ సుధాకర్, మమత, సుజాత, అనిల్, అజయ్ కుమార్, తిరుమల, కళావతి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సిరిసిల్లక్రైం: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్సై రాజు అన్నారు. అంబికానగర్‌లోని శ్రీ శబరి విద్యాలయంలో విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, సరైన పత్రాలు తమ వెంట ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు 'ఆదర్శ'లో ఎగ్జిబిషన్

బోయినపల్లి: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో బుధవారం అంకురం బిజినెస్ ఇన్నోవేటర్స్ కార్యక్రమంలో భాగంగా అంతర్ జిల్లాస్థాయి ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నిమ్మల సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

సుభాష్ చంద్రబోస్‌ను ఆదర్శంగా తీసుకోవాలి


సిరిసిల్లటౌన్: నేతాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న చైర్‌పర్సన్ కళ, నాయకులు


బోయినపల్లి: పూలమాల వేస్తున్న నాయకులు


వీర్నపల్లి : పూలు చల్లుతున్న నాయకులు

సిరిసిల్లటౌన్: 'నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆదర్శంగా తీసుకోవాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. మంగళవారం సుభాష్‌నగర్‌లోని జయంతి వేడుకల్లో ఆమె మాట్లాడారు. కౌన్సిల్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండీ ఆయాజ్, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్ దార్నం అరుణ, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, టీఎస్‌పీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

బీజేపీ నాయకులు నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, ఊరగొండ రాజు, వేణు, గుడ్ల విష్ణు, శ్రీహరి, ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల ముందు సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి బందారపు లక్ష్మారెడ్డి, నాయకులు ద్యాగం లక్ష్మీనారాయణ, సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: బోయినపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, నాయకులు ఉదారి నర్సింహా చారి, పరశురామ్ ఎడపల్లి, జువ్వెంతుల శ్రీనివాసరెడ్డి, సారంపల్లి రాజు, తదితరులున్నారు

చందుర్తి : మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడారు. మల్యాలలో వివేకానంద యూత్ సభ్యులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. యూత్ సభ్యులు లింగంపల్లి మధుసూదన్, దివ్యసాగర్, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి : సుభాష్ యూత్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. సెస్ డైరెక్టర్ మల్లేశం ,ఎంపీటీసీ అరుణ్‌కుమార్, ఉపసర్పంచ్ రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు పెంచాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి


మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను జిల్లా వైద్యాధికారి సుమన్ మోహనరావుతో కలిసి మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా దవాఖానాలోని ఓపీ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం పీహెచ్‌సీ డాక్టర్ ప్రియాంక, సిబ్బందితో సమావేశమయ్యారు. డెంగీ, చికెన్ గున్యా, మలేరియా జ్వరాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో అవుతున్న ప్రసవాలపై వివరాలు సేకరించారు. ×మిషన్ 80శా లో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు చేయాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో గత నెలలో 29 ప్రసవాలు అయ్యాయని వైద్య అధికారి ప్రియాంక తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు శ్రీరాములు, రజిత, ఆర్బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ నయిమా తదితరులు పాల్గొన్నారు.

యువత సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న డీఆర్డీవో శ్రీనివాస్

వేములవాడఅర్బన్: మిడ్‌మానేరులో ముంపునకు గురైన పునరావాస కాలనీల నిరుద్యోగ యువత ప్రభుత్వం అందించే శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో నక్క శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం చీర్లవంచ, కొడుముంజ గ్రామాల్లో నాబార్డ్ సౌజన్యంతో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 18 నుంచి 50 ఏళ్లలోపు గల 10వ తరగతి పాస్, ఫెయిల్, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్ అర్హతలు గలవారు ఎంపిక చేసుకున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమాలకు సంబంధించి అవగాహన సదస్సు నిర్వహించారు. నాబార్డ్ సౌజన్యంలో మహిళలు, యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్, వివిధ అంశాల్లో 15 రోజులు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని, మధ్యాహ్న భోజన సదుపాయం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగు సత్తెమ్మ, ఎంపీటీసీ వనపర్తి దేవరాజు తదితరులు ఉన్నారు.

టెట్‌తో సంబంధం లేకుండా పదోన్నతులు కల్పించాలి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): టెట్‌తో సంబంధం లేకుండా ఎస్‌జీటీ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వారిని స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని టీఎస్‌టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హజునాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎల్లారెడ్డిపేటలో టీఎస్‌టీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటరమణతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హజునాయక్ మాట్లాడుతూ, గతంలో బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలన్నారు. డీఎస్సీ నిర్వహించే లోపు విద్యా వాలంటీర్లను నియమించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లకావత్ రవి, ప్రధాన కార్యదర్శి అజ్మీరా సురేందర్, గౌరవ అధ్యక్షుడు మూడ్ భరత్, నాయకులు కార్తీలాల్, తిరుపతినాయక్, రమేశ్, బాలయ్య, రమేశ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు


మాట్లాడుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అర్హులైన వారికి అందిస్తామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుబంధు డబ్బులు అందుతాయని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు,. గడపగడపకూ పథకాలు అందేలా కార్యకర్తలు కృషిచేయాలన్నారు. కాంగ్రెస్‌లో చేరుతామన్న వారిని బీఆర్‌ఎస్ నాయకులు బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, గిరిధర్ రెడ్డి, నాయకులు రాజునాయక్, రాములు, బుచ్చాగౌడ్, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్‌మీట్ ప్రారంభం


స్పోర్ట్స్‌మీట్ ప్రారంభిస్తున్న అడిషనల్ డీఆర్డీవో మధన్‌మోహన్

తంగళ్లపల్లి: మండలంలోని ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాలలో స్పోర్ట్స్ మీట్‌ను మంగళవారం అడిషనల్ డీఆర్డీవో మధన్‌మోహన్, ఎంపీడీవో పి.లచ్చాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఆర్డీవో మాట్లాడుతూ, పిల్లలందరూ క్రీడా స్ఫూర్తిని పెంచుకొని జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవరుచుకుని కష్టపడి చదవాలన్నారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం గుండెల్లి రవీందర్, ఉపాధ్యాయులు పలుమారు తిరుపతి, గాజంగి కీర్తి, గట్టు శ్రీకాంత్, పట్టెం పద్మ తదితరులు పాల్గొన్నారు.

డీపీవో విచారణ


విచారణ జరుపుతున్న డీపీవో రవీందర్

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం డీపీవో రవీందర్ విచారణ నిర్వహించారు. మిడ్‌మానేరులో ముంపునకు గురైన వరదవెల్లికి అనుబంధంగా ఉండే రాజన్నపేట గ్రామంలో పలు ఇళ్లకు ముంపు పరిహారం అందించేందుకు అధికారులు చెక్కులు సిద్ధం చేశారు. అయితే గ్రామానికి చెందిన కొందరు ఇళ్ల పరిహారం పొందినవారే మళ్లీ పరిహారం పొందేందుకు ప్రయత్నిస్తున్నారని భూసేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్‌కు గత డిసెంబర్‌లో ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో డీపీవో ఆయా ఇంటి యజమానులతో మాట్లాడి, వారి ఇళ్లకు సంబంధించి పన్ను రసీదులు, తదితర ఆధారాలు పరిశీలించారు. ఫిర్యాదులో ఉన్న 9 ఇండ్లకు సంబంధించిన జీపీ రికార్డులు పరిశీలించారు. కాగా తమకు ఇళ్ల పరిహారం అందించాలని వారు డీపీవోకు విజ్ఞప్తి చేశారు. విచారణ పూర్తి నివేదిక వివరాలు ఎస్డీసీ అధికారులకు అందించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. డీపీవో వెంట ఎంపీవో గంగాతిలక్, తదితరులు ఉన్నారు.

26న ప్రారంభం

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో నిర్మించిన మున్నూరుకాపు సంఘం భవనాన్ని ఈనెల 26న ప్రారంభించనున్నట్లు ఆ సంఘం మండలాధ్యక్షుడు నందికిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మున్నూరుకాపు కులస్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సర్పంచులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

బియ్యం వితరణ

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి చెందిన కుంచం దేవయ్య తండ్రి మృతిచెందగా బాధిత కుటుంబాన్ని యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి నాగండ్ల భూమేశ్, నాయకులు పరామర్శించారు. అనంతరం 50 కిలోల బియ్యం అందజేశారు. ఇక్కడ నాయకులు తదితరులున్నారు.